గ్రూప్ 1కు 1: 100 అనుమతించడం కొత్తేమీకాదు

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): గ్రూప్–1 మెయిన్ పరీక్షకు 1ః100 మంది చొప్పున అవకాశం కల్పించడం పెద్ద కష్టమేమి కాదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సచివాలయం సాధారణ పరిపాలన శాఖ నుంచి మెమోను పంపిస్తే టీజీపీఎస్సీ వారు 1ః100 మందిని అనుమతిస్తారని ఆయన సోమవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దీని వల్ల ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఉండవని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1:100 మందిని అనుమతించారని గుర్తుచేశారు. దీనిని మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

టీజీ న్యాబ్ లఘుచిత్రాల పోటీ

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): జూన్ 26న అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'సమాజంపై మాదకద్రవ్యాల ప్రభావం' అనే అంశంపై టీజీ న్యాబ్ లఘు చిత్రాల పోటీ నిర్వహిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, వివిధ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామని, ఇందుకు అనుగుణంగా లఘుచిత్రాలు రూపొందించాలని టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. పోటీల్లో ఉత్తమ లఘుచిత్రాలను ఎంపిక చేసి ప్రథమ బహుమతికి రూ.50 వేలు, ద్వితీయ రూ.30 వేలు, తృతీయ రూ.20 వేలు ప్రకటించారు. ఆసక్తి కలిగిన షార్ట్‌ఫిల్మ్ మేకర్స్ జూన్ 20లోగా తమ లఘు చిత్రాలను నిర్దేశిత విధానంలో పంపాలని, సందేహాలుంటే 8712671111, 8712661710, 8712661735 నంబర్లలో సంప్రదించాలని టీజీ న్యాబ్ అధికారులు కోరారు.

జాబ్ క్యాలెండర్ జాడేది?

మొదటిపేజీ తరువాయి...

అమలు చేయటం లేదని నిలదీశారు. డీఎస్సీ పరీక్ష జూలై 17 నుంచి 31 వరకు, గ్రూప్–2 పరీక్ష ఆగస్టు 7, 8న ఉన్నాయని.. ఈ రెండు పరీక్షలకు 7 రోజుల వ్యవధే ఉన్నదని తెలిపారు. ఇంత తక్కువ సమయంలో పరీక్షలకు ప్రిపేర్ కాలేక సంగీత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నదని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ భారీగా ప్రకటనలు ఇచ్చిందని, ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటిదాకా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఒక్క కొత్త నోటిఫికేషన్ విడుదల చేయలేదని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ప్రణాళిక ఏదని ప్రశ్నించారు.

ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంచాలి

రాష్ట్రంలో ఆసరా పింఛనుదారులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని చెప్పి 6 నెలలు దాటినా అమలు చేయటం లేదని హరీశ్ ఆరోపించారు. ఇచ్చే పాత పింఛనును కూడా ఏప్రిల్, మే నెలలవి ఇంకా ఇవ్వలేదని తెలిపారు. ఇంట్లో ఉండే అవ్వాతాతలకు ఇద్దరికీ రెండు పింఛన్లు ఇస్తామని చెప్పారని, ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారని, ఇంతవరకూ అమలు చేయటం లేదని ప్రశ్నించారు. పేదల పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యం అని నిలదీశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఏపీ సీఎం పింఛన్‌ను రూ.4వేలకు పెంచారని, ఏపీని చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అక్కడ పెంచిన పింఛనును ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నారని, తెలంగాణలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసరా పింఛనుదారుకి రూ.12 వేలు చొప్పున కాంగ్రెస్ ప్రభుత్వం బకాయి పడిందని, ఈ నెలకు కలిపి మొత్తం రూ.16 వేలు ఇవ్వాలని అన్నారు. దివ్యాంగులకు మాట ప్రకారం రూ.6 వేలు ఇవ్వాలని వెల్లడించారు.

తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

ఒకటో తేదీన జీతాలేవి?

ప్రతి నెల 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా, ఆచరణలో అమలు కావటం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆశ వర్కర్లు తమకు రెండు నెలలుగా వేతనాలు రావటం లేదని ధర్నా చేశారని, ప్రభుత్వం చెప్పేది నిజమా? ఆశ వర్కర్లు చెప్పేది నిజామా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంగన్‌వాడీ టీచర్లకు రెండు నెలలుగా జీతాలు రావటం లేదని, రాష్ట్రవ్యాప్తంగా 65 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జీతం కోసం ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా జీతాలు ఇవ్వటం లేదని, పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవటం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. సొంత ఖర్చులతో ట్రాక్టర్లలో డీజిల్ పోయించుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నదని, 65 వేల సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీకి రెడీగా ఉన్నా.. వాటిపై కేసీఆర్ బొమ్మ ఉన్నదన్న కారణంతో నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయకుండా నిలిచిపోయాయని తెలిపారు.

నీట్‌పై నీలినీడలు

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించిన నీట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ హయాంలో వైద్య విద్య అంగట్లో సరుకులా మారిందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు నీట్‌కు హాజరయ్యారని, ఆ విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని వెల్లడించారు. నీట్‌లో గ్రేస్ మార్కుల విధానమే లేదని, కానీ ఇప్పుడు ఆ విధానాన్ని అమలు చేశారని, గతంలో ఎన్నడూ లేనట్టు 67 మందికి ఫస్ట్ ర్యాంకు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఒకే సెంటర్లో పరీక్ష రాసిన ఆరుగురికి 720 మార్కులెలా వచ్చాయని నిలదీశారు. గ్రేస్ మార్కులు కలిపిన 1,563 మంది పేర్లు, ప్రాతిపదిక ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు.ఫలితాలను పది రోజులు ముందుకు జరిపి, పార్లమెంటు ఎన్నికల ఫలితాల రోజే ఎందుకు విడుదల చేశారని, దీనిపై అనుమానాలున్నాయని తెలిపారు. పేపర్ లీక్ కాకపోతే బీహార్, గుజరాత్‌లో ఎందుకు అరెస్టులు జరుగుతున్నాయని ప్రశ్నించారు. 24 లక్షల మంది విద్యార్థుల అంశంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు విద్యార్థులకు అన్యాయం జరగకుండా బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి స్పందించాలని అన్నారు. మన్ కీ బాత్‌లో మాట్లాడే ప్రధాని నీట్‌పై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా విచారణ సంస్థతో సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

నిబద్ధతను దెబ్బతీయొద్దు

సోషల్ మీడియా వ్యూస్ కోసం ఒక నాయకుడి నిబద్ధత, నిజాయితీని దెబ్బతీయొద్దని హరీశ్ సూచించారు. తాను బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్టు అనవసరంగా ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంచలనాల కోసం తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లలో ఏవేవో ప్రచారం చేస్తున్నారని అన్నారు. దయచేసి ఇలాంటి థంబ్‌నెయిల్స్ పెట్టవద్దని, లైక్స్, వ్యూస్ కోసం ఒక నాయకుడి నిబద్ధత, నిజాయితీని దెబ్బతీయవద్దని తెలిపారు. ఇకనైనా ఇలాంటివి మానుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోడానికి వెనకాడబోనని హెచ్చరించారు. సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

మాటలు వింటున్న నల్ల కోడి

- యజమాని చెప్పినట్టు ముందు, వెనుకకు కదలిక
- జగిత్యాలలో ఆకట్టుకుంటున్న కడక్‌నాథ్ కోడి

జగిత్యాల రూరల్, జూన్ 17: అవును.. ఈ కోడి యజమాని ఏది చెప్తే అదే వింటున్నది. ముందుకు వెళ్లమంటే ముందుకు.. వెనక్కి రమ్మంటే వెనక్కి వస్తూ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎడమల మల్లారెడ్డి తన భూమిలో వ్యవసాయం చేయడంతోపాటు కోళ్లు, చేపలు పెంచుతుంటాడు. అందులో భాగంగానే.. తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై నుంచి కడక్‌నాథ్ జాతికి చెందిన కొన్ని కోడి పిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నాడు. ఒక్కో కోడి పిల్లను రూ.150కి కొనుగోలు చేశాడు. అందులో ఇప్పుడు ఆరు నెలల వయసున్న ఓ నల్ల కోడి మల్లారెడ్డి చెప్పినట్టు వింటున్నది. వెనక్కి, ముందుకు వెళ్లడం, యజమానిపై కూర్చోవడం వంటి పనులు చేస్తున్నది. ఈ కోడి అంటే తనకు చాలా ఇష్టమని, తాను చెప్పినట్టు వింటున్నదని మల్లారెడ్డి చెప్తున్నాడు. ఈ కోడి చేష్టలను చూసినవారంతా ఆశ్చర్యచకితులవుతున్నారు.

జూబ్లీహాల్‌లోనే మండలి సమావేశాలు

- పాత అసెంబ్లీ భవనం పునరుద్ధరణ ఇప్పట్లో కానట్టే!
- పురావస్తు నిర్మాణం కావడంతో పనుల్లో జాప్యం

హైదరాబాద్, జూన్ 17(నమస్తే తెలంగాణ): పాత అసెంబ్లీ భవనంలో శాసనమండలి సమావేశాలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆకాంక్ష ఇప్పట్లో నెరవేరేలా లేదు. అది పురావస్తు భవనం కావడంతో పునరుద్ధరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలి కొనసాగుతున్న జూబ్లీహాల్‌ను పార్లమెంటు సెంట్రల్ హాలు తరహాలో సెంట్రల్ హాలుగా వినియోగించాలని, పాత శాసనసభ భవనంలో మండలి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎల్‌పీ, ఇతర ఫ్లోర్ లీడర్ల కార్యాలయాలను కూల్చివేసి అసెంబ్లీ ప్రాంగణానికి చివర్లో నిర్మించేందుకు, పబ్లిక్ గార్డెన్ నుంచి లలితా కళాతోరణం వరకు సుందరీకరించి అసెంబ్లీ ప్రాంగణాన్ని ఒక ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి అందరికీ కనిపించే విధంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. రూ.50కోట్ల అంచనాతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు.ఈ భవనం పురావస్తు నిర్మాణం కావడంతో పునరుద్ధరణ పనులు హెరిటేజ్ కన్జర్వేటివ్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. సిమెంటు వాడకుండా సున్నంతో పనులు నిర్వహిస్తున్నందున, పునరుద్ధరణ పనులకు మరింత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వచ్చే మండలి సమావేశాలు కూడా యథావిధిగా జూబ్లీహాల్‌లోనే కొనసాగనున్నాయి.

గ్రూప్స్ పరీక్షలపై ఒత్తిడి పెంచండి

- గ్రూప్-1 మెయిన్‌కు 1:100 మందిని అనుమతించేలా ప్రభుత్వాన్ని నిలదీయండి
- మాజీ మంత్రి హరీశ్‌రావుకు అభ్యర్థుల వినతి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): గ్రూప్–1లో మెయిన్‌కు 1:100 విధానంలో అర్హుల జాబితా ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు అభ్యర్థులు విజ్ఞప్తిచేశారు. సోమవారం తెలంగాణభవన్‌కు వచ్చిన గ్రూప్–1, గ్రూప్–2, 3 పరీక్షల అభ్యర్థులు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అభ్యర్థులు మీడియాతో మాట్లాడుతూ.. వివిధ కారణాలతో గ్రూప్–1 రద్దు అయిందని, తెలంగాణ వచ్చిన నాటినుంచి తొలి గ్రూప్–1 అయినందున ఎన్నో ఏండ్లుగా విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారని, ఈ సమయంలో 1:50 విధానంలో కొద్ది మందికే మెయిన్ అవకాశం లభిస్తుందని, ఆ పరిధిని 1:100 కు పెంచాలని కోరారు. గ్రూప్–2లో 2 వేలు, గ్రూప్–3లో 3 వేల పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో కాంగ్రెస్ నాయకులు ఇదేవిషయాన్ని చెప్పి, అమలు చేయడంలేదని విమర్శించారు. గ్రూప్ –2ను డిసెంబర్‌లో, గ్రూప్–3ను డిసెంబర్ చివరివారంలో ఉండేలా పరీక్ష తేదీలు నిర్ణయించాలని కోరారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం!

- రూ.1.74 కోట్లతో ల్యాండ్ స్కేపింగ్ పనులు
- డిజైన్ల ఖరారు తర్వాత హెచ్ఎండీఏ టెండర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): సచివాలయం ఎదుట మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. లుంబినీ పార్కు, తెలంగాణ అమరవీరుల స్మారకం ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని అందంగా పచ్చదనంతో ఉండేలా డిజైన్ చేసి పనులు చేపట్టాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కి ప్రభుత్వం సూచించింది. కొత్త సచివాలయం నిర్మాణం తర్వాత తెలుగుతల్లి విగ్రహం కూడలిని పూర్తిగా తొలగించి సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుతోపాటు దాని చుట్టు పక్కల అభివృద్ధికి సుమారు రూ.1.74 కోట్ల వ్యయం అంచనా వేశారు. హుస్సేన్‌సాగర్ తీరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, ట్రాఫిక్ చిక్కులు లేకుండా పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ల్యాండ్ స్కేపింగ్ చేస్తున్నట్టు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన నూతన సచివాలయాన్ని చూసేందుకు నగరవాసులతోపాటు వివిధ ప్రాంతాలను నిత్యం ప్రజలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కూడలిని ప్రత్యేకంగా డిజైన్ చేసి నిర్మిస్తున్నామని, ఇప్పటికే ఆర్కిటెక్టులతో కలిసి హర్టికల్చర్ విభాగం అధికారులు చర్చలు జరిపారని తెలిపారు. దీనికి డిజైన్లు ఖరారు చేసిన తర్వాత టెండర్లు పిలిచి పనులు చేపడతామని హెచ్ఎండీఏ అధికారులు పేర్కొన్నారు.

కొండాకు 'చేవెళ్ల'ను గిఫ్ట్ ఇచ్చిన సీఎం?

- చేవెళ్ల లోక్‌సభ స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్
- బలం చేకూర్చుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి, విశ్వజిత్‌రెడ్డి వ్యాఖ్యలు
- చేసిన సాయానికి రేవంత్‌రెడ్డి రుణం తీర్చుకున్నారని చర్చ

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్‌కు ఈ రెండు వ్యాఖ్యలే నిదర్శనం. ఇటీవలి ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఏకంగా 1.73 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కనీసం ఒక్క ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, ఎంపీపీ కూడా లేని నియోజకవర్గంలో బీజేపీకి ఏకంగా 8 లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పరోక్షంగా సహకరించడం వల్లే ఈ ఫలితం వచ్చిందనేది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. వాస్తవానికి చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే డమ్మీ అభ్యర్థులను నిలబెట్టారని మొదటి నుంచి విమర్శలు ఉన్నాయి. చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన పట్నం సునీత మహేందర్‌రెడ్డిని తీసుకొచ్చి మల్కాజిగిరిలో పోటీ చేయించిన సంగతి తెలిసిందే. రాత్రికి రాత్రి పార్టీ మారి ప్రజాగ్రహాన్ని మూటగట్టుకున్న రంజిత్‌రెడ్డికి చేవెళ్ల టికెట్ ఇచ్చారు. వాస్తవానికి ఎంపీ టికెట్ ఇస్తామన్న హామీ మేరకే పట్నం సునీత, మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారనేది బహిరంగ రహస్యం. ఈ మేరకు చేవెళ్లలో పట్నం సునీతను పోటీ చేయిస్తే మెరుగైన ఫలితం ఉంటుందని నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు నెత్తీనోరు కొట్టుకున్నారు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి పట్టుబట్టి మరీ రంజిత్‌రెడ్డిని బరిలో నిలిపారు.

రుణం తీర్చుకునేందుకేనా?

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన ప్పటి నుంచి రేవంత్‌రెడ్డికి మద్దతుదారుగా, సన్నిహితుడిగా పేరొందారు. రేవంత్‌రెడ్డికి 2021 జూలైలో పీసీసీ అధ్యక్ష పదవి దక్కడంలో తాను కీలక పాత్ర పోషించారని కొండా పదేపదే చెప్తుంటారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇప్పించడానికి నేను చాలా లాబీ చేశాను' అని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో ఓ మీడియా చానల్‌తో పేర్కొన్నారు. అయితే ఎన్నడూ సీఎం రేవంత్‌రెడ్డిగానీ, కాంగ్రెస్ గానీ ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం గమనార్హం. దీనిని బట్టి కొండా, రేవంత్‌రెడ్డి మధ్య స్నేహం బలమైనదేనని అర్థమవుతున్నదని చెప్తున్నారు. అందుకే అప్పట్లో తనకు చేసిన సాయానికి రుణం తీర్చుకునేందుకే చేవెళ్ల నుంచి 'పట్నం' కుటుంబాన్ని బయటికి పంపి, కొండాపై డమ్మీ అభ్యర్థిని నిలబెట్టాడనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా చేయాలని నాన్న సపోర్ట్ చేశారు. రంజిత్‌రెడ్డి వంటి వ్యక్తికి చేవెళ్ల టికెట్ ఇవ్వడమే వారిద్దరి మధ్య స్నేహానికి నిదర్శనం. పట్నం సునీత మహేందర్‌రెడ్డి అభ్యర్థి అయితే టఫ్ ఫైట్ ఉండేది. రంజిత్‌రెడ్డిని పెట్టడమే మాకు పెద్ద గిఫ్ట్' అని కొండా విశ్వజిత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే చేవెళ్లలో సరైన నాయకులు, కార్యకర్తలు లేకపోయినా కొండా గెలిచారన్న వాదనలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పడిన ఓట్లలో భారీగా బీజేపీకి పడ్డాయని స్వయంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. 'చేవెళ్లలో మాకు ఒక్క ఎమ్మెల్యే లేరు, జెడ్పీటీసీ లేరు, ఎంపీపీలు లేరు, కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. వాస్తవానికి బీఆర్ఎస్ ఓట్లు మాకు పడలేదు. వాళ్ల ఓట్లు దాదాపు 2 లక్షలు వాళ్లకే పడ్డాయి. గతంలో బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్న మైనార్టీలు దాదాపు రెండు లక్షల మంది కాంగ్రెస్‌కు ఓటేశారు. రాజేంద్రనగర్‌లో సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మహేశ్వరంలో పహాడిషరీఫ్, జల్‌పల్లిలో బీఆర్ఎస్ ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంకులో 40 శాతం బీజేపీకి పడింది' అని ఓ ఇంటర్వ్యూలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన విజయానికి గల కారణాలను వివరించారు. దీనిని బట్టే చేవెళ్ల పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి మళ్లాయని, ఇది రెండు పార్టీల మధ్య జరిగిన అంతర్గత ఒప్పందానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

- చేవెళ్ల లోక్‌సభ స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్
- బలం చేకూర్చుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి, విశ్వజిత్‌రెడ్డి వ్యాఖ్యలు
- చేసిన సాయానికి రేవంత్‌రెడ్డి రుణం తీర్చుకున్నారని చర్చ

చేవెళ్లలో డమ్మీ క్యాండిడేట్‌ను నిలబెట్టారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డికి నేను ధన్యవాదాలు చెప్తున్నా

- ఇటీవల చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు

రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిని చేయాలని అప్పట్లో నాన్న గట్టిగా పోరాడారు. ఇప్పుడు చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని నిలబెట్టడమే మాకు ఆయన ఇచ్చిన పెద్ద గిఫ్ట్. పట్నం సునీత మహేందర్‌రెడ్డి అభ్యర్థి అయితే టఫ్ ఫైట్ ఉండేది

- ఇటీవల కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుమారుడు విశ్వజిత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు

వంద రోజులు.. 46 లక్షల మంది భక్తులు

ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు వెల్లడి

యాదాద్రి భువనగిరి, జూన్ 17 (నమస్తేతెలంగాణ) : భువనగిరిలో స్వర్ణగిరీశుడిని 46 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన ఆలయంలో మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు వివిధ ట్రస్ట్‌ల ద్వారా రూ. 12.49 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఆలయానికి వచ్చే ప్రతి పైసా భక్తుల కోసమే ఖర్చు చేస్తామని తెలిపారు. దేశంలోనే ఆధునిక ఆర్కిటెక్చర్‌లో అయోధ్య రామమందిరం తర్వాత స్వర్ణగిరి రెండో స్థానంలో నిలిచిందని అన్నారు.16 ఆర్జిత సేవలను www.ytdtemple.com వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. రోజుకు 8 వేల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారని తెలిపారు.

- పశువుల పాకగా సర్కార్ బడి



ఖమ్మం నగర పరిధిలోని గొల్లగూడెం ప్రాథమిక పాఠశాల పశువుల కొట్టంగా మారింది. ఆదివారం, సోమవారం పాఠశాలలకు సెలవులు రావడంతో పక్కనే నివాసం ఉండే ఓ పాడి రైతు తన పశువులను ఈ స్కూలు ప్రాంగణంలోని చెట్ల కింద కట్టేశాడు. బడి పిల్లలు ఉండే పాఠశాల ప్రాంగణంలో పశువులు దర్శనమిస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గేటుకు తాళం వేయకపోవడంతోనే పశువులను కట్టేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. – రఘునాథపాలెం

పంతుళ్ల సొమ్ముతో పాఠశాలల నిర్వహణ

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ స్కూళ్లు
- సక్రమంగా కిరాయి చెల్లించని సర్కారు
- ఇరుకు గదులు, వసతుల లేమితో విద్యార్థుల అవస్థలు

వరంగల్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యారంగం కునారిల్లుతున్నది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను సర్కారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లో 26 ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు ప్రభుత్వం సక్రమంగా కిరాయి చెల్లించడం లేదు. వరంగల్ మండలంలో 4, ఖిలావరంగల్ మండలంలో 6 పాఠశాలల భవనాలకు రూ.21 లక్షలకుపైగా అద్దెను పెండింగ్‌లో పెట్టడంతో వాటిని ఖాళీ చేయాలని విద్యాశాఖ అధికారులపై యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలలను సమీపంలోని ఇతర భవనాల్లోకి తరలించి, ఉపాధ్యాయులు తమ సొంత సొమ్ముతో అద్దె చెల్లించాల్సి వస్తున్నది. వరంగల్ ఎల్బీనగర్ లోతుకుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నది. అది కూడా ఒకే ఒక ఇరుకు గదిలో. ఆ గదిని ఉపాధ్యాయులు ఉపయోగించుకుంటూ విద్యార్థులకు వరండాలో పాఠాలు బోధిస్తున్నారు. అదే గదిపైన కార్మికులు మధ్యాహ్న భోజనం వండి విద్యార్థులకు పెడుతున్నారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ప్రతి నెలా రూ.1,000 చొప్పున తమ సొంత సొమ్మును అద్దెగా చెల్లిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆ గది అద్దెను రూ.2 వేలకు పెంచాలని యజమాని డిమాండ్ చేస్తుండడంతో ఉపాధ్యాయులకు ఏమీ పాలుపోవడం లేదు. నిరుడు ఈ పాఠశాలలో 17 విద్యార్థులుండగా.. ఈ ఏడాది వారి సంఖ్య 12కు పడిపోయింది. ప్రస్తుతం వారు కూడా స్కూలుకు రావడం లేదు. వరంగల్ ఎల్బీనగర్ ఎంజే రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి మరీ దయనీయంగా